
వెళ్లినట్టే వెళ్లి....!

- పులిచెర్ల మండలంలో మళ్లీ మొదలైన గజదాడులు
- ఏనుగు చనిపోయిన చోట వరిపంట ధ్వంసం

కల్లూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో మూడేళ్లుగా తిష్ట వేసిన ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తూ అన్నదాతలకు అపారనష్టం కలిగించాయి. మూడు నెలలుగా కల్లూరు, పాళెం, పాతపేట, చల్లావారిపల్లి, దేవళంపేట, బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీల్లో ఏనుగుల గుంపు వరుస దాడులు చేపట్టడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేవారు. పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపు ఐదు రోజుల క్రితం మండలాన్ని వీడి సరిహద్దులోని సదుం మండలం వైపు తరలిపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.ఇంతలో మంగళవారం రాత్రి మళ్లీ మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు వరి, మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. సదుం మండలంలోని పశ్చిమ విభాగం అటవీ ప్రాంతం నుంచి వచ్చిన 16 ఏనుగుల గుంపు ముందుగా కల్లూరు సమీపంలోని రిలయన్స్ టవర్ వద్దకు చేరుకున్నాయి.వెంకట్రామయ్య మామిడిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు తలారివారిపల్లి వద్దకు చేరుకొని నౌషాద్‌కు చెందిన పశుగ్రాసాన్ని ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి జడ్పీ ఉన్నత పాఠశాల వద్దకు చేరుకొని కల్లూరులోని సాదిక్ ఆలీ, మంగళంపేటలోని రామకృష్ణయ్యకు చెందిన మామిడిచెట్లను విరిచేశాయి. అక్కడి నుంచి పాతపేట పంచాయతీ చిట్టారెడ్డిపేట సమీపంలో ఈనెల 4వ తేదీన ఏనుగు మృతి చెందిన ప్రాంతానికి చేరుకున్నాయి. సమీపంలోని గురప్ప వరిపంటను తొక్కేశాయి. అక్కడి నుంచి రెండు గ్రూపులుగా విడిపోయిన ఏనుగుల గుంపు ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లి వైపు ఒక గ్రూపు , చుక్కావారిపల్లి వైపు మరో గ్రూపు వెళ్లాయి. చుక్కావారిపల్లి సమీపంలో శేఖర్‌కు చెందిన పూలతోటను ఏనుగులు ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి చిట్టారెడ్డిపేట వద్దకు చేరుకున్న ఏనుగులు పీలేరులోని వెంకట్రమణకు చెందిన టమోటా పంటను ధ్వంసం చేశాయి. చిట్టారెడ్డిపేట వద్ద కలిసిపోయిన ఏనుగులు గంటావారిపల్లి మార్గంలో అడవిలోకి తిరిగి చేరుకున్నాయి. బుధవారం పగలంతా గోగులమ్మ వంక సమీపంలో ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.


గోగులమ్మ వంక సమీపంలో గజసంచారం


ఏనుగులు తొక్కేసిన వరిపంట

ఖరీఫ్ రైతులకు యూరియా కష్టాలు...!


బంగారుపాళ్యంలో ఎరువుల కేంద్రం వద్ద యూరియా కోసం వేచివున్న రైతులు


చిత్తూరు సెంట్రల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులను తాజాగా యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. మేలో ప్రకృతి అనుకూలిస్తుందని భావించిన రైతులు పంటల సాగుపై ఆశలు పెంచుకున్నారు. జూన్ మొదటి వారంలో వర్షాలు కురుస్తాయని భావిస్తే రైతులకు నిరాశే మిగిలింది. దీనికి తోడు వేరుశనగ విత్తనాల కొరత వెంటాడింది.ఇప్పుడేమో యూరియా కొరత పట్టి పీడిస్తోంది.

ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని 1,18,386 మంది రైతులు 1,78,262 ఎకరాల్లో 22 రకాల పంటలు సాగు చేయనున్నారు. మరో 90 వేల మంది రైతులు 85 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలైన టమోటా, బొప్పాయి, సపోటా, అరటి, జామ తదితర పంటలతో పాటు పూల సాగు చేపట్టారు.28,010 ఎకరాల్లో సాగు చేసే వరితో పాటు 1160 ఎకరాల్లోని ఆవుగడ్డి, 17,127 ఎకరాల్లోని గడ్డి, 18,732 ఎకరాల్లోని చెరకుతో పాటు 85 వేల ఎకరాల్లో సాగు చేసే ఉద్యాన పంటలకు యూరియా అవసరం వుంది.ఈ సీజన్‌లో 1160 ఎకరాల్లో వరి సాగు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 1140 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. వరి పంట చేతికి రావాలంటే యూరియా తప్పనిసరైంది. వాతావరణం అనుకూలించకపోవడంతో రైతులు పాడిపై ఆధారపడాల్సి వస్తోంది. ఆవుగడ్డిసాగు అధికమైంది. దీన్ని పెంచుకోడానికి రైతులు అధికంగా యూరియాను వాడాల్సిన పరిస్థితి వచ్చింది. వీటితో పాటు ఉద్యాన పంటలకు యూరియా తప్పనిసరి కావడంతో దానికి డిమాండ్ ఏర్పడింది.

చాలీ చాలని ఎరువులు

ఖరీఫ్ సీజన్‌లో 55 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం వుండగా, 40,320 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉంచారు. సీజన్ మొదట్లోనే దాదాపు 15 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల కొరత ఏర్పడింది. తొలి స్టాక్ అయిపోగా, వారం రోజుల కిందట 3550 మెట్రిక్ టన్నులు జిల్లాకు చేరాయి. ప్రస్తుతం 530 మెట్రిక్ టన్నుల యూరియా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచగా, డీలర్ల వద్ద 900 మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ గోదాములో 2 వేల టన్నులు ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వరితో పాటు కొన్ని పంటలకు తగినంత మోతాదులో యూరియా వాడాల్సి ఉండగా, రైతులు వరితో పాటు ఎక్కువగా గడ్డి, పూల, ఉద్యాన పంటల సాగుకు వినియోగిస్తుండటం యూరియా కొరతకు కారణమని అధికారులు చెబుతున్నారు. యూరియా అధిక మోతాదులో వాడితే భూసారం తగ్గిపోతుందని హెచ్చరిస్తున్నారు.

మూడు నెలలుగా యూరియా లేదు



వరి పంటతో పాటు పశుగ్రాసం సాగు కోసం మూడు నెలలుగా యూరియా కోసం ఎదురుచూస్తున్నా. ఫలితం లేకపోవడంతో చిత్తూరు, పలమనేరు ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం నుంచి ఫోన్ ద్వారా మీకు యూరియా వస్తోందా? వ్యవసాయాధికారులు మీ వద్దకు వస్తున్నారా? అంటూ ఒకటి నొక్కండి, రెండు నొక్కండి అంటున్నారు. ఇక్కడ మేము యూరియా లేకుండా అల్లాడుతున్నాం. పట్టించుకునే అధికారులు లేరు.

- గోపాల నాయుడు, గోవర్ధనగిరి, బంగారుపాళ్యం మండలం

ఆర్‌బీకేలో యూరియా ఉంచాలి



యూరియా కోసం తిప్పలు తప్పడం లేదు. వంకాయ, మిరప, పశుగ్రాసం సాగు చేస్తున్నా. వర్షాలు లేకపోవడంతో పంటను కాపాడుకునేందుకు యూరియా అవసరం ఉంది. రెండు వారాలుగా రైతు సేవా కేంద్రం చుట్టూ తిరుగుతున్నా యూరియా దొరకలేదు.దీంతో ప్రైవేటు డీలర్లపై ఆధారపడాల్సి వస్తోంది.

- శ్రీరాములు, కట్టప్పగారిపల్లె,బంగారుపాళ్యం మండలం



కనుల పండువగా శ్రీనివాసుడి పుష్పపల్లకి

తిరుమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆణివార ఆస్థానం సందర్భంగా బుధవారం సాయంత్రం చిరుజల్లుల నడుమ పుష్పపల్లకీ సేవ కనులపండువగా జరిగింది. వివిధ రకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన పల్లకీపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని కొలువుదీర్చి శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. పల్లకీలోని ఉత్సవమూర్తులను భక్తులు దర్శించి ఆనందపరవశులయ్యారు. ఆరురకాల సంప్రదాయ పుష్పాలు, మరో ఆరు రకాల స్వదేశీ, విదేశీ కట్‌ఫ్లవర్స్‌తో కలిపి మొత్తం టన్ను బరువు కలిగిన పుష్పాలను పల్లకి అలంకరణకు వినియోగించారు. వివిధ దేవతామూర్తుల ప్రతిమలను పల్లకీకి ఏర్పాటు చేశారు. పుష్పపల్లకీ సేవకు ముందు వర్షం పడి నిలిచిపోయిన క్రమంలో ఆలయంపై ఏర్పడిన ఇంద్రధనస్సు భక్తులకు కనువిందు చేసింది. ఈఅందాల నడుమ పుష్పపల్లకీ ఉత్సవం శోభాయమానంగా దర్శనమిచ్చింది. భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవంలో పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.



తిరుపతిలో 19న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రకు సీఎం హాజరు

- పీ4 మార్గదర్శులు, బంగారు కుటుంబాలతో ముఖాముఖి



తిరుపతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 19వ తేదీన తిరుపతి రానున్నారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏదో ఒక జిల్లాలో సీఎం పాల్గొనడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ శనివారం తిరుపతిలో పర్యటించనున్నారు. భక్తులతో కలసి కపిలేశ్వరాలయ ఆవరణను, పుష్కరిణిని శుభ్రపరచనున్నారు. అనంతరం పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకుని పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులను, బంగారు కుటుంబాలను కలుసుకుంటారు. మార్గదర్శులుగా ముందుకొచ్చిన హోటల్ తాజ్, హోటల్ పాయ్ వైస్రాయ్, రాస్, రోటరీ క్లబ్, అమరరాజా సంస్థల ప్రతినిధులతో పాటు ఆ సంస్థలు దత్తత తీసుకునే బంగారు కుటుంబాల్లో ఎంపిక చేసిన పది కుటుంబాలతో సీఎం చంద్రబాబు ముఖాముఖీ సమావేశం కానున్నారు. ఈ ఈ కార్యక్రమాలతో పాటు ఒకట్రెండు అదనపు కార్యక్రమాలు కూడా సీఎం పర్యటన షెడ్యూలులో చేరనున్నట్టు సమాచారం. గురువారం అధికారికంగా పర్యటన ఖరారయ్యే అవకాశముంది. కాగా, సీఎం చంద్రబాబు తిరుపతిలో పర్యటించనున్న ప్రదేశాలను బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధనరాజు, సీఎం భద్రతా విభాగం అధికారులు పరిశీలించారు.

18న నగరిలో జాబ్‌మేళా

చిత్తూరు అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడీప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18న నగరిలోని శ్రీసూర్య డిగ్రీ, జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 19 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, టెన్త్, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ అర్హత కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన వారికి రూ.12 నుంచి రూ.22వేల వరకు వేతనాలు అందే అవకాశాలు ఉన్నాయన్నారు. నిరుద్యోగ అభ్యరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 63008 54441ను సంప్రదించాలని కోరారు.

లఖ్‌నవూ శిక్షణలో డీసీసీబీ చైర్మన్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నాబార్డు అనుబంధ సంస్థ (బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్) ఆప్కాబ్ ఆధ్వర్యంలో లఖ్‌నవూలో సోమవారం నుంచి బుధవారం వరకు జరిగిన సెమినార్ కార్యక్రమంలో చిత్తూరు డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రంలోని 13 డీసీసీబీ చైర్మన్లకు లఖ్‌నవూలోని బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ నిరుపమ్ మెహ్రోత్రా అధ్యక్షతన మూడ్రోజుల సెమినార్ జరిగింది. ఇందులో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఆప్కాబ్ డీజీఎంలు పాల్గొన్నారు. ఇందులో భాగంగా అమాస రాజశేఖర్‌రెడ్డి పలు సంస్థలను సందర్శించారు. వివిధ అంశాలపై కార్యక్రమంలో చర్చించినట్లు చైర్మన్ తెలిపారు.

ఆధార్ నమోదులో పొరపాట్లకు తావివ్వకండి

కలెక్టర్ సుమిత్‌కుమార్


ఆధార్ నమోదు ప్రక్రియపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మన దైనందిన వ్యవహారాల్లో పలు అంశాలు ముడిపడివున్న ఆధార్ నమోదులో పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఆధార్ నమోదు ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి అన్నారు.ఆధార్ నమోదు ప్రక్రియలో రాష్ట్రస్థాయి లో చిత్తూరు జిల్లా 58 శాతం మాత్రమే పూర్తిచేసి వెనుకబడివుందన్నారు. సెప్టెంబరు నెలాఖరుకు ఆధార్ నమోదు వందశాతం పూర్తికావాలని ఆదేశించారు. జనన ధ్రువీకరణ పత్రం జారీచేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కుప్పం, నగరి నియోజకవర్గాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించాలని సూచించారు. త్వరలో ఆర్డీవోలు, ఎమ్మార్వోలు, మున్సిపల్ కమిషనర్లతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. బయోమెట్రిక్ అప్‌డేషన్ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. 0-5 సంవత్సరాల పిల్లల జనాభా (2024 అంచనా) ప్రకారం 1,53,047 మంది ఉండగా, ఇప్పటివరకు 89,179 మంది చిన్నారుల (58శాతం) ఆధార్ అప్డేషన్ మాత్రమే జరిగిందని తెలిపారు. ప్రతినెలా అన్నీ పాఠశాలలు, అంగన్‌వాడీలలో పిల్లల ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించాలన్నారు. డీఎల్‌డీవో రవికుమార్, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, ఎల్డీఎం హరీష్ పాల్గొన్నారు.

చిత్తూరులో వర్షం



చిత్తూరు కల్చరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో బుధవారం రాత్రి జడివాన కురిసింది.8 గంటలనుంచి 9గంటల వరకు,10 గంటల నుంచి దాదాపు గంటన్నర పాటు జడివాన కురవడంతో పౌరజీవనం స్తంభించింది. దాదాపు గంటన్నర పాటు రోడ్లపై వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. వర్షం కారణంగా థియేటర్లలో సెకండ్ షోలను రద్దు చేశారు. చర్చివీధి, పొన్నియమ్మగుడి వీధి, ఓటీకే రోడ్డు, బజారువీధి, డీఐ రోడ్డు, గిరింపేట, దర్గా, కాజూరు, ఇరువారం, ప్రభుత్వాస్పత్రి ప్రాంతాలు వర్షం కారణంగా రాత్రి 8 గంటలకే నిర్మానుష్యమయ్యాయి. గంగాసాగరం, ప్రశాంతనగర్,ఇరువారం అడవి,రిజర్వు ఫారెస్టు ప్రాంతాల్లో పిడుగులు పడినట్లు సమాచారం.




విశ్వజిత్ రాణే - ప్రణీత

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. గోవా మంత్రి విశ్వజిత్ రాణే, సినీ హీరోయిన్ ప్రణీత ఉన్నారు.

ఆధునీకీకరించిన ల్యాబ్‌ను పరిశీలించిన ఈవో

తిరుమల, జూలై16(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పలు ప్రాంతాల్లో టీటీడీ ఈవో శ్యామలరావు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ అండ్ వాటర్ ల్యాబ్‌లో ఆధునీకరించిన యంత్రాలను పరిశీలించారు. నెయ్యిని వంద శాతం పరిశీలించేందుకు వీలుగా ఇటీవల ఏర్పాటు చేసిన గ్యాస్ క్రోమటోగ్రాఫీ(జీసీ), హై పెర్ఫార్మన్స్ లిక్విడ్ కోమటోగ్రాఫీ(హెచ్‌పీఎల్‌సీ) యంత్రాల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఏఎన్సీ, హెచ్‌వీసీ ఉప విచారణ కార్యాలయాల వద్ద జరుగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించి సూచనలు చేశారు. అంతకుముందు తిరుమలలోని అన్నమయ్య భవనానికి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రాన్ని పరిశీలించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఈఈ సుబ్రహ్మణ్యం, డిప్యూటీఈవోలు వెంకటయ్య, భాస్కర్, సోమన్నారాయణ, డీఈ చంద్రశేఖర్, హెల్త్‌ఆఫీసర్ మధుసూదన్ ఇతర అధికారులు ఈవో వెంట ఉన్నారు.



ఫుడ్ వాటర్ ల్యాబ్‌లో పరీక్షల గురించి సిబ్బందితో మాట్లాడుతున్న ఈవో తదితరులు

సర్వ దర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని తొమ్మిది షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.19 కోట్లు
మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,020
తలనీలాలు సమర్పించినవారు: 27,609

ఆయువు పోసే ఆలయం



హృద్రోగ బాధిత చిన్నారులకు అక్కడ ఊపిరిపోస్తారు. గుండె కవాటాలను సరిచేసి ప్రాణం నిలబెడతారు. ఆరోగ్య జీవితాన్ని ప్రసాదించి ఆయువునిస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే గుండె సంబంధిత వ్యాధిగ్రస్థులకు అది ఆలయమే. పేదలకు అమూల్య సేవలందిస్తున్న పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్ అనతికాలంలోనే హృదయాలయమనే పేరును సార్థకం చేసుకుంది. టీటీడీ ఆధ్వర్యంలోని బర్డ్ ఆస్పత్రి ప్రాంగణంలో ఈ సెంటర్ 2021లో ప్రారంభమై తన సేవలతో రోగుల హృదయంలో స్థానం సంపాదించుకుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- 4 వేల మంది చిన్నారులకు హృద్రోగ శస్త్రచికిత్సలు
- 20 మందికి విజయవంతంగా గుండె మార్పిడి
- రోగులను గుండెకు హత్తుకుంటున్న పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్



పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్



కొత్త భవనం నమూనా

నవజాత శిశువుల నుంచి వృద్ధుల వరకు పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్ గుండెకు హత్తుకుని అలంబనగా నిలుస్తోంది. మూడున్నరేళ్ల వ్యవధిలోనే గుండెకు సంబంధించి ఎన్నో సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలు చేసి ఓ ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకుంది. రాష్ట్రంలో గుండె మార్పిడి చేసే ఏకైక ఆస్పత్రిగా గుర్తింపు సాధించింది. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి సారథ్యంలో 14 మంది వైద్యనిపుణులు నిరంతరం ఇక్కడ సేవలందిస్తున్నారు. తక్కువ కాలంలోనే 20మందికి గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేశారంటే విస్తుపోవాల్సిందే. ప్రమాదవశాత్తూ చనిపోయినవారి గుండెను గ్రీన్ చానల్ ద్వారా వాయువేగంతో తెచ్చి మృత్యువు అంచున చేరిన వారిని కాపాడుతున్నారు. నాలుగు వేల మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేసి వారిలో మళ్లీ చిరునవ్వులు పూయించారు. రోగులను ఇంతలా మానవీయ సేవలందిస్తున్న ఈ ఆస్పత్రి ప్రస్థానాన్ని చూసి అపోలో ఆస్పత్రుల చైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి అచ్చెరువొందారు. రెండేళ్ల క్రితం ఆయన సెంటర్‌ను సందర్శించి వైద్యబృంద సేవలను కొనియాడారు. ఇంతకంటే గొప్పగా తమ ఆస్పత్రి ఉండదంటూ సంస్థ తరఫున పరికరాలు అందజేస్తూ కితాబునిచ్చారు.


పేదుకు ఉచిత వైద్య సేవలు

టీటీడీ శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టు సహకారంతో నడుస్తున్న హార్ట్ సెంటర్‌లో వైద్యసేవలు పేదలకు ఉచితం. ఎన్టీఆర్ వైద్యసేవతో పాటు ఆయుష్మాన్ భారత్ కార్డులున్న వారికీ ఇక్కడ ఉచితంగా వైద్యం చేస్తున్నారు. మన రాష్ట్రానికి చెందిన వారే కాకుండా యూపీ, బిహార్, జార్ఖండ్, వెస్ట్ బెంగాల్, ఒడిశానుంచీ వస్తుంటారు. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ నుంచి కూడా హృద్రోగ బాధితులు వస్తున్నారంటే సెంటర్ విశిష్టత అర్థం చేసుకోవచ్చు. ఈ సేవలను గుర్తించిన ఆసియా టుడే రీసెర్చ్, మీడియా 2023లో బెస్ట్ పీడియాట్రిక్ కార్డియాక్ సెంటర్‌గా ఎంపిక చేసింది.

విస్తరణ దిశగా అడుగులు

హార్ట్ సెంటర్ మరింత విస్తరించనుంది. బర్డ్ ఆస్పత్రి పాత భవనంలో 70 పడకలతో తాత్కాలికంగా ప్రారంభమైన ఈ సెంటర్ ఇప్పుడు రూ.250కోట్లతో పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీగా రూపుదిద్దుకుంటోంది. ఇందులో 350 పడకలుంటాయి. 14 అదనపు పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీస్ సేవలు అందుబాటులోకి వస్తాయి. న్యూరాలజీ, కిడ్నీ వ్యాధులు, కాలేయం, హెమటో అంకాలజీ, తలసీమియా రోగులకు సేవలందిచడంతోపాలు బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ చికిత్స సైతం చేసేందుకు వడివడిగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ఐకానిక్‌గా నిర్మిస్తున్న కొత్త భవనంలో మల్టీ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఎయిర్ అంబులెన్స్ యూనిట్ సైతం ఏర్పాటవుతోంది. మరో ఏడాదిలో హార్ట్ సెంటర్ మరింతగా ఎదిగేందుకు సమాయత్తమవుతోంది.

చికిత్స పొందుతున్న చిన్నపిల్లల వార్డు



హార్ట్ సెంటరుకు శ్రీ'నాథుడు'



హార్ట్ సెంటర్ గుర్తింపు వెనుక డైరెక్టర్ శ్రీనాథ్ రెడ్డి విశేష ప్రతిభ,పెద్ద మనసు దాగి ఉంది. ఉత్తమ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్‌గా తన బృందానికి సమర్థ సారథ్యం వహిస్తున్నారు. దాతల ద్వారా వచ్చే అధునాతనమైన పరికరాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. పేరెన్నికగన్న కార్పొరేట్ ఆస్పత్రులు నెలకు రూ.10 లక్షలు జీతమిస్తామన్నా స్వామి సన్నిధిలో సేవ చేయడంలోనే ఆయన సంతృప్తి చెందుతారని శ్రీనాథ్ సన్నిహితులు చెబుతారు.తెలంగాణ గవర్నర్ తమిళిసై నుంచి డాక్టర్ శ్రీనాథ్ అవార్డు అందుకున్నారు.

నా బిడ్డకు పునర్జన్మ



హైదరాబాద్‌లో నా భార్య బాబుకు జన్మనిచ్చింది. వెనువెంటనే పసికందుకు గుండె సమస్య ఉందని తేలింది. హైదరాబాదులో రూ. 6లక్షలు అవుతుందన్నారు. ఏం చేయాలో పాలుపోలేదు. తిరుపతి హార్ట్ సెంటర్ గురించి తెలుసుకుని ఈనెల 9న జాయిన్ చేశాం. 48 గంటల్లోనే వైద్యులు శస్త్రచికిత్స చేశారు. బిడ్డకు పునర్జన్మ ఇచ్చారు. ఈ ఆస్పత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం.

- మురళి, ఆటోడ్రైవర్, సి.మల్లవరం, చిత్తూరు జిల్లా



నాకు కొత్త బతుకు ఇచ్చారు

మాది తూర్పుగోదావరి జిల్లా జి.రాగంపేట. మా నాన్న రైతు. గతేడాది డిసెంబరులో నాకు చాతిలో ఇబ్బంది వచ్చింది. చాలా ఊళ్లు తిరిగాం. తగ్గలేదు. చివరికి గుండె మార్పిడి చేయాలన్నారు. విశాఖ వైద్యుల సూచనతో ఈ ఏడాది జనవరి 21న తిరుపతి హార్ట్ సెంటర్‌కు వచ్చాం. దాత గుండె కోసం ఇక్కడే అద్దెకు ఇల్లు తీసుకుని ఎదురుచూశాం. మార్చి 2న గుండె దొరికిందని ఫోన్ చేశారు. విజయవాడలో బ్రెయిన్ స్ట్రోక్‌తో చనిపోయిన వ్యక్తి నుంచి గుండెను ఆగమేఘాలపై తెచ్చి నాకు అమర్చారు. 40 రోజులు ఆస్పత్రిలోనే ఉన్నా. ఆస్పత్రి డైరెక్టర్ శ్రీనాథ్ సర్ కొత్త బతుకునిచ్చారు. నెలకోసారి రివ్యూకి వస్తున్నా. ఇప్పుడు ఆరోగ్యం బాగుంది.

- వై. వినయ్, బి.ఫార్మసీ విద్యార్థి

ఘాట్‌లో అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు



ప్రమాదానికి గురైన కారు, గాయపడిన భక్తులు

తిరుమల,జూలై16(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో బుధవారం ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. బెంగుళూరుకు చెందిన నలుగురు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వినాయక స్వామి ఆలయానికి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది.

21న టీటీడీ ఎస్వీ శిల్ప కళాశాల ప్రవేశ పరీక్ష

తిరుపతి అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలోని ఎస్వీ శిల్పకళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 21న పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు అలిపిరి సమీపంలోని కళాశాల ప్రాంగణంలో పరీక్ష జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకోని వాళ్లూ నేరుగా పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావచ్చన్నారు. ఇందుకుగాను రూ.350 చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. అర్హత సాధించినవారికి విద్యార్థులకు 28వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఎంపికైన వారికి ఉపాధి అవకాశాల నిమిత్తం మొదటి ఏడాదిలోనే టీటీడీ రూ.లక్ష బ్యాంకులో డిపాజిట్ చేస్తుందన్నారు. నాలుగేళ్లలో ఆలయ నిర్మాణం, శిల, సుధా, దారు, లోహ శిల్ప, సంప్రదాయ చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 0877-2264637, 98669 97290, 94403 67826 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఐఐటీలో నేడు ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ ప్రారంభం



ఐఐటీలోని ఫుడ్‌ప్రాసెసింగ్ సెంటర్

ఏర్పేడు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని ఐఐటీలో కామన్ ఇంక్యుబేషన్ సెంటర్(సీఐసీ)ని గురువారం కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో శేఖర్ బాబు పాల్గొననున్నారు. ఈ కేంద్రాన్ని ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ కింద ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిత్వశాఖ అభివృద్ధి చేసింది. ఈ కేంద్రాన్ని తిరుపతి ఐఐటీ రసాయనిక ఇంజినీరింగ్ ప్రొఫెసర్ కె.ఎస్.ఎం.రాఘవరావు సమన్వయంతో ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మార్గదర్శకత్వంలో అభివృద్ధి చేశారు. ఈ కేంద్రంలో రోజుకు 20 టన్నుల మామిడి, అంజీర్, జామ తదితర పండ్లతో జ్యూస్, పల్ప్, జామ్, పికిల్స్ వంటివి తయారు చేస్తారు. ఈ యూనిట్ విద్యార్థులకు పరిశోధన కేంద్రంగా కూడా ఉపయోగపడుతుంది. స్థానికంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కానుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

బంగారు కుటుంబాలకు భరోసా ఇవ్వాలి

- ఎల్లుండి మార్గదర్శకులతో సీఎం ముఖాముఖి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆదాయంలో అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించి, బంగారు కుటుంబాలుగా ఎంపిక చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. వారికి భరోసా ఇవ్వాలని కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులు, మార్గదర్శకులతో పీ4పై సమావేశం నిర్వహించారు. వీరిని ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న వారు దత్తత తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. విద్యతోపాటు నైపుణ్యం కల్పించి అండగా నిలవాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. శనివారం తిరుపతికి వస్తున్న సీఎం చంద్రబాబు.. బంగారు కుటుంబాలు, మార్గదర్శకులతో ముఖాముఖి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య, తాజ్ హోటల్, పాయ్ వైస్రాయ్ హోటల్ ప్రతినిధులు, రాస్, అమరరాజా, రోటరీ క్లబ్ మార్గదర్శకులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ హెల్త్‌స్కీం గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్‌స్కీం 2025-26వ ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా అక్రిడిటేషన్లు కలిగివున్న వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకానికి ప్రీమియం కింద రూ.1250 డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఎఫ్ఎంఎస్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా హెడ్ అకౌంట్ 8342-00-120-01-03-001-001, డీడీవో కోడ్ 2703 0802 003 పద్దు కింద చెల్లించి లబ్ధిపొందాలన్నారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, రెన్యూవల్ చేసుకున్న అక్రిడిటేషన్ జిరాక్స్ కాపీలను కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార పౌరసంబంధాల కార్యాలయంలో అందించాలన్నారు. హెల్త్‌స్కీమ్ ప్రీమియం రూ.2500 కాగా, ఇందులో జర్నలిస్టు వాటా రూ.1250, ప్రభుత్వ వాటా రూ.1250 అన్నారు. జర్నలిస్టు భార్య, భర్త, పిల్లలు, వారిపై ఆధారపడ్డ తల్లిదండ్రులకు ఈ స్కీమ్ వర్తిస్తుందన్నారు. జర్నలిస్టుల వైద్యఖర్చులను డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు విధివిధానాలను అనుసరించి చెల్లిస్తుందన్నారు. జర్నలిస్టులకు లేదా వారిపై ఆధారపడ్డ కుటుంబసభ్యులకు ఏదైనా అనారోగ్యం సంభవిస్తే హెల్త్‌స్కీమ్ ద్వారా రూ2 లక్షల వరకు విలువచేసే వైద్యసేవలు అందుతాయన్నారు. ఇలా సంవత్సర కాలంలో ఎన్నిసార్లయినా పరిమితి లేకుండా ఈ సదుపాయాన్ని పొందవచ్చని చెప్పారు. వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) తరహాలో నగదు రహితంగా వైద్యసేవలను ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. దీనిపై ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, నిర్దేశిత చికిత్సలకు సంబంధించి ఉచిత ఔట్‌పేషంట్ సేవలు కూడా పొందవచ్చని ఆయన సూచించారు.

అవ్వాచారి లోయలోకి దూకేశాడు

- రోప్‌ల ద్వారా దిగి జీపు డ్రైవరును రక్షించిన భద్రతాసిబ్బంది

తిరుమల, జూలై16 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని లోయలో దూకిన ఓ డ్రైవర్‌ను టీటీడీ భద్రతా సిబ్బంది కాపాడారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలోని దొర్నిపాడుకు చెందిన జీపు డ్రైవర్ బోయా మాధవ రాయుడు(30) బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో అలిపిరి కాలినడకమార్గంలో తిరుమలకు వస్తూ అక్కగార్ల ఆలయానికి సమీపంలోని అవ్వాచారి లోయలోకి దూకేశాడు. గమనించిన భక్తులు వెంటనే సమీపంలోని భద్రతా సిబ్బందికి సమాచారమిచ్చారు. తిరుమల పోలీసులు, ఫైర్, విజిలెన్స్, ఫారెస్ట్ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని రోప్‌ల ద్వారా లోయలోకి దిగి వెతికారు. గాయాలతో ఉన్న మాధవ రాయుడిని పైకి తీసుకొచ్చి తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. చిన్న చిన్న గాయాలతోపాటూ అతడి చేయి విరిగిందని, ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తన భార్య అనారోగ్యం వల్ల లోయలోకి దూకేశానని మాధవ రాయుడు పోలీసులకు తెలిపారు.



మాధవ రాయుడిని లోయ నుంచి బయటకు తీసుకొస్తున్న భద్రతాసిబ్బంది - చికిత్స పొందుతున్న మాధవ రాయుడు


- రైలు పెట్టె కాలిన ఘటనలో

ఇద్దరు ఎస్ఎస్ఈల సస్పెన్షన్!

తిరుపతి(సెంట్రల్), జూన్16(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్ రైళ్ల పార్కింగ్ యార్డులో రెండు రోజుల క్రితం బోగీ కాలిపోయిన ఘటనలో ఇద్దరు ఎస్ఎస్ఈలను సస్పెండ్ చేసినట్లు ఉన్నత స్థాయి అధికార వర్గాలు తెలిపాయి. హిస్సార్- తిరుపతి వారాంతరపు ఎక్స్‌ప్రెస్ రైలు బోగీ కాలిన ఘటనపై విచారణ జరుగుతోంది. పీసీఎంఈ, సీనియర్ డీఎంఈ మణికుమార్, ఇతర అధికారులు కాలిన బోగీని పరిశీలించారు. సోమవారం విధి నిర్వహణలో ఉన్న పర్యవేక్షక సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు మురళి, వరప్రసాద్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. కాగా, ఈ మంటలను సకాలంలో గుర్తించడం ద్వారా.. కోట్ల రూపాయల రైల్వే ఆస్తిని కాపాడిన చిరుద్యోగి, పాయింట్స్ మెన్ హరీష్ కుమార్ ఇంటికి బుధవారం గుంతకల్లు డివిజన్ అదనపు డివిజన్ మేనేజరు సుధాకర్ వెళ్లారు. గాయపడిన ఆయన్ను పరామర్శించారు.

రైల్వే స్టేషన్‌లో ఏడీఆర్ఎం తనిఖీలు

తిరుపతి రైల్వే స్టేషన్లలో బుధవారం గుంతకల్లు డివిజన్ ఏడీఆర్ఎం మణికుమార్ తనిఖీలు నిర్వహించారు. ప్లాట్ ఫారాలను పరిశీలించారు. పరిశుభ్రత ప్రమాణాలను మెరుగు పరచాలని ఆదేశించారు. మొదటి ప్లాట్ ఫారంలోని కార్యాలయాలను పరిశీలించిన ఆయన.. కాలం చెల్లిన వస్తువులను స్టోర్స్‌కు తరలించాలని ఆదేశించారు. అధికారులు మణికంఠ, మణికుమార్ ఎస్ఎమ్ఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి పంట

మళ్లీ ఏనుగుల భయం

- యల్లంపల్లెలో వరిపొలాలపై దాడి

చంద్రగిరి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏనుగులు మళ్లీ అలజడి రేపుతున్నాయి. యల్లంపల్లెలో మంగళవారం అర్ధరాత్రి పంట పొలాలపై దాడి చేశాయి. ఏడు ఏనుగులు చొరబడి ధనప్రకాష్‌రెడ్డి, మునికృష్ణయాదవ్‌లకు చెందిన పొలాల ఫెన్సింగ్ రాళ్లను తొలగించి పైపులు ధ్వంసం చేశాయి. వరి పంటను తొక్కేశాయి. గ్రామానికి ఆనుకొని పొలాలు ఉండటంతో ఏనుగులు వచ్చి దాడి చేస్తాయేమోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. వీరి సమాచారంతో అటవీ అధికారులు, సిబ్బంది వచ్చి ఏనుగులను అటవీ ప్రాంతంలోకి మళ్లించడానికి ప్రయత్నించారు. మూలపల్లి చెరువులో నీరుతాగి, ముంగిలిపట్టు అటవీ ప్రాంతంలోకి ఇవి వెళ్లిపోవడతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఏనుగులు పొలిమేరలోనే ఉండటంతో గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లకూడదని, అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. గతంలో మామిడిమానుగడ్డలో ఏనుగులు తిరగబడటంతో యల్లంపల్లి, భీమవరం, మూలపల్లె, కొండ్రెడ్డికండ్రిగ గ్రామస్థులు కలవరపడుతున్నారు. ఏనుగుల దాడిపై ఎమ్మెల్యే పులివర్తి నానీ అటవీశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. కొద్దిరోజులపాటు ఆ ప్రాంతంలో తిరుగుతూ ఏనుగులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత రైతులకు త్వరగా నష్టపరిహారం చెల్లించేలా చూడాలని ఆదేశించారు.



పొలాలపై దాడులు చేస్తున్న ఏనుగులు

ఇలా వచ్చారు... అలా వెళ్లారు...!


సిబ్బందితో మాట్లాడుతున్న డైరెక్టర్ మస్తానయ్య

చిత్తూరు సెంట్రల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాల హెచ్ఎంల నాయకత్వ లక్షణాలపై జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ (ఎస్ఐఈఎంఏటీ) డైరెక్టర్ వీఎన్ మస్తానయ్య బుధవారం పరిశీలించారు. ప్రాంగణంలోని ఐదు గదుల్లో శిక్షణా తరగతులు నిర్వహిస్తుండగా, కేవలం ఒక్క గదిని మాత్రం నామమాత్రంగా చూశారు. తరగతులను పూర్తిగా పరిశీలించకపోవడం, శిక్షణ పొందుతున్న టీచర్లను నిర్వహణపై అడిగి తెలుసుకోకపోవడంతో టీచర్లు నిరాశ చెందుతున్నారు. ఆ సమయంలో సమగ్రశిక్ష ఏపీసీ సైతం లేకపోవడంతో కింది స్థాయి సిబ్బందిని పలకరించి ఇలా వచ్చి... అలా వెళ్లి పోవడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్



చిత్తూరు సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... మాజీ సీఎం జగన్ ఎప్పటిలాగే అబద్ధాల స్క్రిప్ట్‌తో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారని చెప్పారు. ఇటీవల పేర్ని నాని వీడియోలో చెప్పిన విధంగా కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా స్క్రిప్ట్‌ను జగన్ చదివారన్నారు. వైసీపీని ప్రజలు ఛీ కొట్టి కేవలం 11 సీట్లకే పరిమితం చేసినా ఇంకా వారి మానసిక పరిస్థితి మారలేదని ఎద్దేవా చేశారు. నీతి, నిజాయితీగా పనిచేస్తున్న పోలీసుల మనోభావాలు దెబ్బతినే విధంగా జగన్ మాట్లాడుతున్నారని అన్నారు. డీజీజీ అంటే మాఫియాడాన్ అని జగన్ చేసిన వ్యాఖ్యలు పోలీసు వ్యవస్థమీద దాడి చేయడం కాదా అని ప్రశ్నించారు. చెట్లు నరికించడానికి, పరదాలు కట్టడానికి, టీడీపీ నేతల కదలికలపై నిఘా పెట్టడానికి పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేసిన నీచ చరిత్ర వైసీపీదని విమర్శించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఎక్కిన స్టూల్ లాగేసి, మైక్‌ను కూడా పీకేసేందుకు, తప్పుడు కేసులతో ఇబ్బంది పెట్టడానికి పోలీసులను వాడుకున్నది వైసీపీ నేతలు కాదా అని ప్రశ్నించారు. జగన్‌పై ప్రజలు విశ్వాసం కోల్పోయారని, ఆయన ఎన్ని చెప్పినా ప్రజలు నమ్మేపరిస్థితిలో లేరని సురేంద్ర కుమార్ అన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

● సీపీఐ, సీపీఎం నాయకుల డిమాండ్


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు

చిత్తూరు రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి.. ప్రజలపై భారం తగ్గించాలని సీపీఐ, సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం మరోసారి 2024-25 వినియోగంపై రూ.842 కోట్ల సర్దుబాటు ఛార్జీలు మోపుతూ సదరన్, సెంట్రల్ పంపిణీ సంస్థలు చేసిన తాజా ప్రతిపాదనలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం చేసిన సకీ ఒప్పందాన్ని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు అధికారంలోకి రాగానే అదే ఒప్పందాన్ని కొనసాగించి స్మార్ట్ మీటర్ల ప్రక్రియను వేగవంతం చేయడం దుర్మార్గమన్నారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సమావేశంలో పార్టీలు తీర్మానించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు, నాయకులు బాలసుబ్రమణ్యం, జ్యోతిరావు, గోపీనాథ్, మణి, విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

టీసీ పుస్తకానికి చెదలు


● కనిపించని విద్యార్థుల ఐదేళ్ల వివరాలు


చారాల హైస్కూల్‌లో చెదలు పట్టిన టీసీ పుస్తకం

చౌడేపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చారాల హైస్కూల్‌లో టీసీ పుస్తకాలకు చెదలు పట్టాయి. బుధవారం రికార్డుల కోసం స్కూల్ సిబ్బంది బీరువాను తెరిచారు. అయితే చెదలు పట్టడంతో లోపలున్న 5 సంవత్సరాల సర్టిఫికెట్ల పుస్తకాలు దెబ్బతిన్నాయి. విద్యార్థుల వివరాలు సగానికి పైగా మాయమయ్యాయి.

పుంగనూరులో పట్టపగలే చైన్‌స్నాచింగ్


భాగ్యలక్ష్మి


బైక్‌లో పారిపోతున్న చైన్‌స్నాచర్లు

పుంగనూరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో నడిచి వెళుతున్న ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును బుధవారం ఉదయం ఇద్దరు చైన్‌స్నాచర్లు ద్విచక్రవాహనంలో వచ్చి లాక్కెళ్లారు. బాధితురాలి కథనం మేరకు... పుంగనూరు పట్టణంలోని కట్టకిందపాళ్యానికి చెందిన వెంకటేశులు భార్య భాగ్యలక్ష్మి(70) మనువళ్లకు టిఫిన్ తీసుకురావడానికి ఇంటి సమీపంలోని హోటల్ వద్దకు వెళుతుండగా ఇద్దరు గుర్తు తెలియని దుండగులు ద్విచక్రవాహనంలో వచ్చి మెడలోని బంగారు చైన్ (24 గ్రాములు) లాక్కెళ్లారు. దీంతో భాగ్యలక్ష్మి కిందపడి స్వల్పంగా గాయపడింది. అప్పటికే దుండగులు ద్విచక్రవాహనంలో పరారయ్యారు. పట్టపగలే జనసంచారం ఉన్న కట్టకిందపాళ్యంలోనే చైన్‌స్నాచింగ్ జరగడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీతిపద్యాల గ్రంథావిష్కరణ



చిత్తూరు కల్చరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జైహింద్ పాఠశాలలో ప్రముఖ పద్యకర్త తులసీ నాథం నాయుడు రచించిన నీతి పద్యాల గ్రంథావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా తులసీనాథం నాయుడు మాట్లాడుతూ నీతి పద్యాల పఠనం ద్వారా వ్యక్తిత్వవికాసం అలవడుతుందని తెలియజేశారు.ఉపాధ్యాయులు ప్రకాష్, చంద్రశేఖర్, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.





నగరి సహకారబ్యాంకు నిర్వహిస్తున్న రసాయనిక ఎరువుల గోడౌన్ - షాపింగ్‌కాంప్లెక్స్ - పెట్రోలు బంకు- జనరిక్ మందులషాపు

ఆదర్శం... నగరి సహకార సంఘం

నగరి, జూలై 16(ఆంధ్రజ్యోతి):నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) రైతులకు చేదోడు వాదోడుగా వుంటూ ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలుస్తోంది.వివిధ రకాల వ్యాపారాలు చేస్తూ లాభాల బాటలో ముందడుగు వేస్తోంది.రైతులకు రుణాలు అందించడంతో బాటు వారి మూలధనం రెట్టింపు చేసి, ఆదాయ వనరులను పెంపొందింపజేయడంలో నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పదేళ్లుగా రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలుస్తోంది. లాభాల బాటలో నడిచే ఈ సహకార సంఘం పనితీరును అధ్యయనం చేయడానికి ఇతర రాష్ట్రాల నుంచి సైతం ప్రత్యేక బృందాలు వస్తున్నాయి. సహకార వ్యవస్థ విధానం, లాభాల సాధన, రైతులకు చేయూత తదితర అంశాలను పరిశీలిస్తున్నాయి.



నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

వ్యవసాయ సహకారసంఘం అనగానే రైతులకు రుణాలిచ్చి వసూలు చేయడమే పనిగా నడుస్తున్నాయి.అలాకాక రైతుల సభ్యత్వ సొమ్మును వివిధ రకాల వ్యాపారాల్లో పెట్టుబడులుగా పెట్టి వచ్చిన ఆదాయంతో డీసీసీ బ్యాంకులో డిపాజిట్లు పెంచి జిల్లాస్థాయిలో గుర్తింపు పొందిన ఘనత నగరి సహకారసంఘానికే దక్కుతుంది.1957లో ఏర్పడిన ఈ సహకారసంఘం 2010 నాటికి పూర్తిస్థాయిలో ఆదాయబాట పట్టింది.ఈ సంఘంలో ప్రస్తుతం 8925మంది రైతులు సభ్యత్వం కలిగి వున్నారు.సంఘం మూలధనం రూ.56కోట్ల 36లక్షలుండగా డిపాజిట్లు 28.13లక్షలున్నాయి.డీసీసీ బ్యాంకులో రూ.1.02 కోట్లున్నాయి.రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులను తెప్పించి మార్కెట్ ధర కన్నా రైతులకు తక్కువ ధరలకే అందించడం జరుగుతోంది.ఓ పెట్రోలు బంకును సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. సంఘం పరిధిలో నాలుగు గోడౌన్ సముదాయాలన్నాయి. వాటిని అద్దెకు ఇవ్వడంతో సంఘానికి వార్షికాదాయం వస్తోంది.సహకారం సంఘం పరిధిలోని రైతులకు తక్కువ బాడుగకు ఫంక్షన్ హాలు ఇచ్చేందుకు ఓ ఫంక్షన్‌హాలు నిర్మిస్తున్నారు.రైతులకు ఈ సంఘం ద్వారా అందుతున్న సేవలను పరిశీలించడంతో పాటు దీని పనితీరును అధ్యయనం చేయడానికి నెదర్లాండ్స్ నుంచి ప్రత్యేకబృందం వచ్చింది.2016, 2017 సంవత్సరాల్లో ఉత్తమ సహకారసంఘం అవార్డు, 2018-19లో ఉత్తమ సీఈవో , ఉత్తమ అధ్యక్ష అవార్డులు, 2020-21లో ఉత్తమ సామర్థ్య అవార్డు, 2021-22లో ఆప్కాబ్‌వారి రాష్ట్రస్థాయి ఉత్తమ సామర్థ్య అవార్డును సాధించిన నగరి సహకార సంఘం మిగిలిన సంఘాలకు ఆదర్శంగా నిలిచింది.

రైతులకోసం ఫంక్షన్ హాలు

రైతులకు తక్కువ బాడుగకు ఫంక్షన్ హాలు ఇచ్చి వారి శుభకార్యాలలో సైతం పాలుపంచుకోవడమే ధ్యేయంగా ఓ ఫంక్షన్‌హాలు నిర్మిస్తున్నాం. బ్యాంకులో లాకర్ సదుపాయం వుంది. బంగారు నగలపై రుణాలు అందించి రైతులకు, చిరువ్యాపారులకు సహకారం అందిస్తున్నాం. నిరుపేదలకు జనరిక్ మెడికల్ షాపు ద్వారా 50 నుంచి 90శాతం తగ్గింపు ధరలకు మందులను అందిస్తున్నాం.

\- తులసిపిళ్లై, సీఈవో



తప్పులు లేని ఓటర్ల జాబితాను తయారుచేయాలి

● డీఆర్వో మోహన్ కుమార్


బీఎల్వోల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో మోహన్ కుమార్

చిత్తూరు అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించాలని, డీఎల్వోలు ఓటర్ల జాబితా రూపకల్పన, మార్పులు చేర్పులపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ చెప్పారు. బుధవారం నగర పాలక కార్యాలయంలో జరుగుతున్న బీఎల్వోల శిక్షణా కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా రూపకల్పనలో బీఎల్వోల పాత్ర కీలకమని, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించాలన్నారు. ఇంటింటి పరిశీలనను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఒక కుటుంబంలోని వారంతా ఒకేచోట ఉండేలా చూడాలన్నారు. సర్వే సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఓటర్ల జాబితాలో చిరునామా, ఇతర వివరాల మార్పులు, చేర్పులకు సంబంధించి నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన, తగిన ధ్రువీకరణపత్రాలను జత చేయాలన్నారు. సర్వేలో పారదర్శకంగా వ్యవహరించాలని, పొరబాట్లు చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఏఎస్వో సౌందర్‌రాజన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, కమిషనర్ నరసింహప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాద్, రూరల్, అర్బన్ తహసీల్దార్లు కులశేఖర్, జయప్రకాష్, ఎన్నికల డీటీ హిమగిరి, బీఎల్వోలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో గర్భిణుల నమోదు పక్కాగా జరగాలి

● కలెక్టర్ సూచన

చిత్తూరు కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మాతా, శిశు సంరక్షణలో భాగంగా వైద్యాధికారులు వారి పరిధిలోని పీహెచ్‌సీలలో గర్భిణుల నమోదు పక్కాగా జరిగేటట్లు చూడాలని, ఇందులో మెడికల్ ఆఫీసర్లు నిరంతర పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వైద్య, ఆరోగ్య అంశంపై జిల్లా స్థాయి వైద్యాధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణుల నమోదు ఖచ్చితత్వంతో పూర్తిచేస్తే మాతా, శిశు మరణాలను నివారించవచ్చన్నారు. గర్భం దాల్చిన సమయం నుంచి కాన్పు జరిగే వరకు వారిపట్ల ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్యబృందం ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జన్మించిన ప్రతి శిశువు వివరాలను రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా వారికి నిర్దేశించిన సమయంలో వ్యాక్సినేషన్ వేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కొలమాసనపల్లె, ఓగు, విజలాపురం పీహెచ్‌సీలలో ఇటీవల జరిగిన మాతృమరణాలపై కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో సుధారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు, ప్రోగ్రామ్ అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

40వేల మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుదాం

జిల్లాలో వున్న 40వేల మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కృషిచేస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో అక్షర ఆంధ్ర ప్రారంభం, ఉల్లాస్ పథకం అమలు అంశాలపై ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడేల్‌తో కలిసి జిల్లాలో స్వచ్ఛంద ఉపాధ్యాయుల నియామకం, తరగతుల నిర్వహణపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో వందశాతం వయోజన ప్రాథమిక అక్షరాస్యత సాధించాలన్న లక్ష్యంతో 'అక్షర ఆంధ్ర' అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇందులో 15-59 సంవత్సరాల వయోపరిమితి ఉన్న బలహీన వర్గాలు, మహిళలు, కూలీలపై దృష్టి సారించాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు గ్రామ, వార్డులలో వున్న అంగన్వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవాతో సీమ సస్యశ్యామలం



కుప్పం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా సుజల స్రవంతితో రాయలసీమ సస్యశ్యామలమైందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జగన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో హంద్రీ-నీవాకు మొక్కుబడి నిధులతో అరకొర పనులతో గ్రహణం పట్టించారన్నారు. ఇతర ప్రాంతాలకు అప్పట్లో వలసలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంచనాలను ఏకంగా రూ.1,977 కోట్లకు పెంచుకోవడం తప్ప చేసిన పనులేవీ లేదని ధ్వజమెత్తారు.తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే రాయలసీమ కరువును పారదోలడానికి కంకణం కట్టుకుందన్నారు. అందుకనే సుమారు 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో కాలువల సామర్థ్యం పెంచడానికి చర్యలు తీసుకుందన్నారు. రాయలసీమలో రిజర్వాయర్ల పేరుతో రూ.2,144.50 కోట్ల దోపిడీకి జగన్‌రెడ్డి పాలనలోని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెరతీశాడని, నాటి వైసీపీ పాలన నీటి ప్రాజెక్టుల పేరుతో దోచుకోవడమే లక్ష్యంగా సాగిందని ధ్వజమెత్తారు. అయితే చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే 2025 ఏప్రిల్ నెలలో హంద్రీ-నీవా కాలువ విస్తరణ పనులను తిరిగి ప్రారంభించారని చెప్పారు. ఏకంగా రూ.3,890 కోట్లు వ్యయం చేసి కేవలం వంద రోజుల్లో పనులు పూర్తి చేశారన్నారు.గురువారం మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద హంద్రీ-నీవా కాలువకు ముఖ్యమంత్రి చంద్రబాబు నీటిని విడుదల చేయనున్నారని తెలిపారు. అక్కడి నుంచి కృష్ణా జలాలు కుప్పం బ్రాంచి కెనాల్‌కు, అక్కడి నుంచి నియోజకవర్గంలోని పొలాలకు అందుబాటులోకి రావడానికి ఎంతో కాలం పట్టదన్నారు. కుప్పం నియోజకవర్గ టీడీపీ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీడీపీ కుప్పం రూరల్ మండలాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

1బీ అడంగల్‌లో తప్పు సరిదిద్దడానికి రూ.10 వేలడుగుతున్నారు

● కలెక్టర్‌కు ఫిర్యాదు



చిత్తూరు కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో జరిగిన పొరపాట్ల కారణంగా, 1బీ అడంగల్‌లో పేర్లు తప్పుగా నమోదయ్యాయని, వాటిని సరిదిద్దాలంటూ సర్వే అధికారులను కోరితే ఎకరాకు రూ.10వేలు లంచం ఇస్తే సరిదిద్దుతామని సర్వేయర్లు అంటున్నారని డి.గోవిందరెడ్డి అనే వ్యక్తి వాపోయారు.బుధవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన తన బాధను అర్జీరూపంలో కలెక్టర్‌కు తెలియజేశారు. గంగాధరనెల్లూరు మండలం ముక్కళత్తూరు రెవెన్యూ గ్రామ దాఖలు లెక్క ప్రకారం ఎల్పీఎం నెం.385 (ఖాతా నెం.860)లో 12 ఎకరాల విస్తీర్ణం గల భూమి ఓ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతోంది. గతంలో రీసర్వే చేసిన అధికారుల తప్పిదాల వల్ల 1బీ అడంగల్‌లో సుబ్బులురెడ్డి అని తప్పుగా నమోదయ్యింది. దీన్ని సరిదిద్దాలంటూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ఐదు నెలలుగా ప్రదక్షిణలు చేస్తున్నామన్నారు. మూడు నెలల క్రితం సర్వేయర్ సునీత పలు రికార్డులను పరిశీలించి, ఫైల్ రెడీ చేయాలని, అందుకు కొంత నగదును ఇవ్వాలంటూ డిమాండ్ చేశారని చెప్పారు. సర్వేయర్‌తో పాటు వచ్చిన అసిస్టెంట్ సర్వేయర్ జయచంద్ర కూడా పొరపాట్లను సరిదిద్దాలంటే ఎకరాకు రూ.10 వేలు ఇస్తే నీకు అనుకూలంగా తయారుచేస్తామని చెప్పారన్నారు. దీంతో బుధవారం సర్వేయర్లకు రూ.4వేలు అందజేశానని తెలిపారు. సర్వేయర్ల అకృత్యాలపై గతంలోనే గంగాధరనెల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, రీసర్వేలో జరిగిన పొరపాట్లను సరిదిద్ది తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

తోతాపురి సబ్సిడీ వివరాల పరిశీలన

తవణంపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత మామిడి సీజన్‌లో మండలంలోని మామిడి రైతులకు సంబంధించి విక్రయాల డేటాను కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. బుధవారం మండలంలోని పైమాఘం, గాజులపల్లె, మల్లకుంట సచివాలయాలకు వెళ్లి ఆయా సచివాలయాల పరిధిలోని మామిడి రైతులు ఫ్యాక్టరీలు, ర్యాంపులలో విక్రయించిన మామిడి కాయల డేటాను, రైతులకు సంబంధించిన ఆధార్ నెంబరు, బ్యాంక్ అకౌంట్ నెంబర్లను పరిశీలించారు. రైతులకు సంబంధించిన పొలం, మామిడి సాగు, దిగుబడి వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ సుధాకర్, ఉద్యానశాఖాధికారి సాగరిక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీ4 కార్యక్రమంతో పేదరిక నిర్మూలన

ప్రభుత్వ విప్ థామస్



గంగాధరనెల్లూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి):సీఎం చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమాన్ని సక్రమంగా అధికారులు చేయగలిగితే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ థామస్ అన్నారు.గంగాధరనెల్లూరు ఎంపీడీవో ఆఫీస్‌లో బుధవారం సాయంత్రం నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌పై ఆరు మండలాల్లోని వివిధ శాఖల అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే ఆధారంగా నియోజకవర్గంలో 11వేల పేదకుటుంబాలున్నాయని తేలిందన్నారు. పీ4 ద్వారా వారి భవిష్యత్ బాగుపడాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పీ4 బంగారు కుటుంబాల జాబితా పునఃపరిశీలన కోసం గ్రామసభలను నిర్వహించాలన్నారు. వివిధ రంగాల్లో ఆర్థికంగా రాణించిన పారిశ్రామికవేత్తలను, విదేశాల్లో ఆర్థికంగా స్థిరపడిన ఈ ప్రాంతవాసుల సహకారాన్ని తీసుకొని పేదరిక నిర్మూలనకు కృషి చేయాలన్నారు. దళిత ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మాజీ అడ్వైజర్ డేవిడ్ రేనాల్డ్ , జిల్లా సీపీవో ఆఫీస్ ఏడీ సాంబశివరావు, మండల పరిషత్ ఏవో లోకేష్‌తో పాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి డబ్బుతో జేబులు నింపుకోవాల్సిన అవసరం లేదు

పాలసముద్రం మండలంలో ఎర్రమట్టి అమ్ముకుని జేబులు నింపుకోవాల్సిన అవసరం తనకు ఏమాత్రంలేదని థామస్ చెప్పారు. బుధవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు - తచ్చూరు హైవే రోడ్డు పనులకు ఐదేళ్ళుగా వివిధ గ్రామాల వద్ద గుట్ట మట్టి, ఎర్రమట్టి తోలుకోవడం జరిగిందని, ఒకటో రెండో వాహనాల్లో గ్రావెల్ తీసుకుపోతే తానేదో దగ్గరుండి తీసుకెళ్ళినట్లు పుకార్లు పుట్టిస్తున్నారని ధ్వజమెత్తారు.ఎంతోమంది పారిశ్రామికవేత్తలు నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించడానికి భూమి కావాలని అడుగుతున్నారన్న ఆయన మండలానికి ఐదారు ఫ్యాక్టరీలను తెప్పించి నిరుద్యోగ సమస్యను తీర్చడమే ధ్యేయంగా పనిచేస్తున్నానని తెలిపారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రం



ఉపాధ్యాయులతో ఎంఈవోలు, విద్యార్థులు

కల్లూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల మండలం ఎర్ర పాపిరెడ్డిగారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు శివలింగం, విద్యాసాగర్, చంద్రశేఖర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డికి బుధ వారం పాఠశాల ఆవరణలో సన్మానసభను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తేనే ఉపాధ్యాయులకు గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. ఉపాధ్యాయులు ఎక్కడ పనిచేసినా సమ యపాలన పాటించాలన్నారు. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులకు పూలమాల, శాలువలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం శ్యామల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడి దినోత్సవాన్ని జయప్రదం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న రైతు సంఘ నాయకులు

పలమనేరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మామిడి దినోత్సవాన్ని జయ ప్రదం చేయాలని మామిడి రైతుల సంక్షేమ సంఘ కన్వీనర్ ఉమాపతినా యుడు పిలుపునిచ్చారు. బుధవారం పలమనేరులోని మామిడి ర్యాంపు వద్ద ఆయన రైతులతో కలిసి ప్రపంచ మామిడి దినోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. మామిడి రైతులకు లాభసాటి ధరలు లేకున్నా ప్రభుత్వం రూ.4 సాయం అందించిందన్నారు. అయితే ఫ్యాక్టరీ యజమానులు సిండికేట్‌గా మారి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించక రైతులను ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మామిడి రైతులు సుబ్రహ్మణ్యం నాయుడు, రామ చంద్రనాయుడు, రాజేంద్రనాయుడు, పురుషోత్తమనాయుడు, జానకీరాం, లక్ష్మీ పతి, దేవేంద్రరెడ్డి, చైతన్య, చక్రవర్తి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాత చీరలతో తాళ్ల తయారీ



సోమలలో పాత చీరలతో తాళ్లు తయారు చేస్తున్న శ్రామికులు

సోమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శ్రమే పెట్టుబడిగా చేతి నిండా ఆదాయం పొందుతున్నారు. కర్ణాటక రాష్ట్రం రాయసూర్‌కు చెందిన పలు కుటుంబాల వారు పాత చీరలతో తాళ్లను తయారు చేస్తూ శ్రమే పెట్టుబడిగా రాణిస్తు న్నారు. బుధవారం సోమలలోని శెట్టివారివీధి, స్వయంభేశ్వరస్వామి ఆలయం పలు చోట్ల ఇంటింటికి వెళ్లి పాత చీరలను సేకరించి తాళ్ల తయారీకి శ్రీకారం చుట్టారు. ఒక్కో చీరకు రూ. 35 వంతున ఒక చీరతో ఓ తాడును తయారు చేసి ఆదాయాన్ని పొందుతున్నారు. ఆవులను పొలాల వద్ద తాళ్లతో కట్టు కోవడానికి, తడి దుస్తులను ఆరబెట్టడానికి, పలు రకాలుగా చీరలతో తయారీ చేసిన తాళ్లను రైతుల పొలాల వద్ద వినియోగించుకునేందుకు ఉపయోగకరంగా ఉన్నాయి. రోజూ ఇద్దరు పనిచేస్తే రూ.2000 నుంచి రూ.3000 వరకు సంపాది స్తున్నట్లు వివరించారు.

టీకాలతో పశువుల్లో ముద్ద చర్మవాధి నివారణ



పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లె, జూలై 16(ఆంధ్రజ్యోతి): టీకాలతో పశువులలో ముద్ద చర్మవాధి నివారించొచ్చని డాక్టర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మండ లంలోని చిన్నకంపల్లెలో పశువులకు ఉచితంగా ముద్దచర్మవాధి నివారణకు టీకాలు వేశారు. మండలానికి 12 వేలు టీకాలు అందుబాటులో ఉన్నాయని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసులు రాజీ చేసుకోవాలి



పుంగనూరులో ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తి ఆరీఫా

పుంగనూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చిన్న కేసులకు సమయాన్ని వృథా చేసుకోకుండా మధ్యవర్తిత్వంతో కేసులను పరిష్కరించుకోవడానికి అవకాశం ఉందని పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరీఫా పేర్కొన్నారు. దేశం కోసం మధ్యవర్తిత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక కోర్టు ఆవరణ నుంచి అంబేడ్కర్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివాహ సంబంధించిన కేసులు, చెక్ కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు, గృహహింస, వాణిజ్య తదితర వివా దాల కేసులను మధ్యవర్తిత్వాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్ర మంలో న్యాయవాదుల సంఘ అధ్య క్షుడు చెన్నకేశవులు, బాలాజీ కుమార్, మల్లిఖార్జునరెడ్డి పాల్గొ న్నారు.

మంగళంలో ఘనంగా గంగజాతర

పుంగనూరు, జూలై 16 (ఆంధ్ర జ్యోతి): పుంగనూరు సమీపంలోని మంగళం గ్రామంలో బుధవారం ఘనంగా గంగజాతర జరుపుకు న్నారు. మహిళలు బోణాలు, దీపాల ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సక్రమంగా కురవాలని, పంటలు బాగా పండాలని అమ్మవారికి పూజలు చేపట్టారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రభాకర్

చౌడేపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎప్పటి కప్పుడు ప్రజా సమస్యలు పరిష్కరించాలని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ పేర్కొ న్నారు. బుధవారం చౌడేపల్లెలో ఆయన డివిజన్ స్థాయి సీఐలు, ఎస్‌ఐలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్‌స్టే షన్‌కు వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తించాలని, వారి సమస్యలు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అనంతరం కేసుల వివరాలపై చర్చించారు. కార్యక్రమంలో పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్, సీఐలు నరసింహరాజు, మురళీమోహన్, సుబ్బరా యుడు, ప్రసాద్, ఎస్‌ఐలు నాగేశ్వరరావు, ధనుంజయరెడ్డి, శివశం కర్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



నాగిరెడ్డిపల్లెలో కళాజాత ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

బైరెడ్డిపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని బుధవారం మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. పరిసరాల పరిశు భ్రత, ప్లాస్టిక్ నిషేధం, ఇంటింటికీ చెత్తసేకరణ, తడి, పొడిచెత్తను వేరుచేయడం, వ్యక్తిగత శుభ్రత తదితర అంశాలపై కళాజాతలో ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ ఎంసీవో సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, అంగన్‌వా డీ కార్యకర్త మునిరత్నమ్మ, కళాజాత సభ్యులు రమణబాబు, తిరు పతి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధినిరోధక టీకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి

బైరెడ్డిపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతూరు నత్తం గ్రామంలో బుధవారం బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆరోగ్యవిద్యాధి కారి సావిత్రి వ్యాధినిరోధక టీకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. వ్యాధినిరోధక టీకాలు వేయించడంతో పిల్లలు ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడకుండా ఉంటారన్నారు. గర్భి ణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటూ వ్యక్తిగత శుభ్రత, కుటుంబ నియంత్రణ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు నిరుపమ, అరబ్‌జాన్, ఆశాలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పుంగనూరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాలపై తిరుపతి విజిలె న్స్ అధికారులు ధనుంజయరెడ్డి, ఏవోలు జ్యోతి, రాధ బుధవారం దాడులు చేపట్టారు. నిల్వలు, బిల్లులు, ధరల పట్టికలను పరిశీలిం చారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, మందులు, విత్తనాలు విక్ర యాలు చేయాలని, ప్రతి ఒక్క రైతుకు బిల్లులు ఇవ్వాలని ఆదేశిం చారు. అధిక ధరలకు విక్రయించినా, నాణ్యత లేకపోయినా, స్టాక్ లేదని రైతులను ఇబ్బందులు పెట్టినట్లు ఫిర్యాదులు వస్తే క్రిమి నల్ కేసులు నమోదు చేయడంతో పాటు దుకాణల లైసెన్సును రద్దు చేయనున్నట్లు సూచించారు.

మరుగుదొడ్ల నిర్మాణాలు తప్పనిసరి



మరుగుదొడ్లపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

పుంగనూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఇళ్ల వద్ద మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఇన్‌చార్జి మున్సిపల్ శానిటరీ ఇన్ స్పెక్టర్ మునివెంకటప్ప కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులకు మరుగుదొడ్ల నిర్మాణాలపై అవగా హన కల్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రైవేటు బస్టాండ్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు.

హంద్రీ-నీవా కాలువ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



హంద్రీ-నీవా కాలువ ఆక్రమణలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, జూలై 16 (ఆంధ్ర జ్యోతి): హంద్రీ-నీవా కాలువ ఆక్ర మణలపై అధికా రులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు అయూబ్ ఖాన్, నరసింహులు డిమాండ్ చేశారు. బుధవారం పుంగనూరు మండలం గూడూరుపల్లె సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ వద్ద ఆక్ర మణకు గురైన హంద్రీ-నీవా చిన్న కాలును పరిశీలించారు. జిల్లా అధికారులు ఆక్రమణ స్థలాన్ని పరిశీలించి తొలగించాలని డిమాండు చేశారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల పండుగ

చౌడేపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె మండల ప్రజలు బుధవారం పీర్ల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంగ ళవారం అర్ధరాత్రి పీర్లపండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని గాంధీ వీధిలో ముస్లిం సోదరులు అగ్నిగుండం ఏర్పాటు చేశారు.

చంద్రబాబు సుపరిపాలనలో సుభిక్షం



కుప్పం మున్సిపాలిటీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు



రొంపిచెర్ల మండలం కస్పాపేటలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో చల్లా రామచంద్రారెడ్డి

కుప్పం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభు త్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సాగిస్తున్న సుపరిపాలనలో ప్రజా జీవనం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా కుప్పం పురపాలక సంఘం 166వ బూత్ పరిధిలో ఆయన పార్టీ తరఫున ఇంటిం టికీ తిరిగి ఏడాది కూటమి పాలన సాధించిన ప్రగతిని వివరించారు. కుప్పం నియోజకవ ర్గంలో రూ.12 వందల కోట్ల మేర అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. త్వరలోనే పలు పరిశ్రమలు రాబోతున్నాయని, ఇక నిరుద్యోగం అనేదే ఉండదని, యువతల వలసలు తగ్గుతాయని భరోసా ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలను సైతం కచ్చితంగా అమలు చేస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కు తుందన్నారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయా లేదా విచారించి లేని పక్షంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌బాబు, కౌన్సిలర్ సోము, మాజీ ఎంపీటీసీ వేణుగోపాల్ తదిత రులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** రాష్ట్ర ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని బయప్పగారిపల్లి సింగిల్‌విండో అధ్యక్షులు, పలమనేరు మండల తెలుగు యువత అధ్యక్షులు వెంకటమునిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కన్నమాకులపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్ర మాన్ని నిర్వహించారు. టీడీపీ మండల ఉపాధ్య క్షులు కవీంద్రనాయుడు, పంచాయతీ అధ్యక్షులు పూర్ణచంద్రనాయుడు, వైస్ ప్రెసిడెంట్ అమర నాథ్, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, యూని ట్ ఇన్‌చార్జి నాగరాజు, సుధాకర్, విజయకు మార్, ప్రకాష్‌రెడ్డి, సుదర్శననాయుడు, విశ్వనా థరెడ్డి, మహేష్, ఏకాంబరంనాయుడు, ముర గేష్, మునస్వామిరెడ్డి, రెడ్డెప్ప, శివశంకర్, విజయ్ పాల్గొన్నారు.

● **రొంపిచెర్ల:** అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచం ద్రారెడ్డి అన్నారు. రొంపిచెర్ల మండలం కస్పాపే టలో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నేతలతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరె క్టరు ఉయ్యాల రమణ, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, నాయకులు రవికుమార్‌నాయుడు, ఓబులేశ్వర్ రెడ్డి, రఘునాథరెడ్డి, రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాధవరెడ్డి, శివశంకర్, చిన్నబాబు, మల్లికా ర్జున, జి.ఇమ్రాన్‌ఖాన్, గౌస్‌పీర్‌ఖాన్, బావాజా న్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

● **గంగవరం:** మండలంలోని జంగాలపల్లె, గుండుగల్లు, పసుపత్తూరు, గొర్రెలదొడ్డి గ్రామాల్లో బుధవారం టీడీపీ నాయకులు సుప రిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని చేప ట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు సోమశేఖర్ గౌడ్, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గిరిధర్ గోపాల్, జయసింహ తదిత రులు పాల్గొన్నారు.

● **వి.కోట:** వి.కోట పంచాయతీ గాండ్లప ల్లెలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు. టీడీపీ మండలాధ్యక్షుడు రంగనాథ్, రాము, ఈశ్వర్, ధీరజ్, ముకుంద, ప్రభాకర్, హరీష్, మురుగేష్, ఇక్బాల్ తదిత రులు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలవాలి



మహ్మద్‌రఫీ, సురేష్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం, జూలై 16 (ఆంధ్ర జ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహ కార సంఘాల(పీఏసీఎస్)కు కొత్తగా నియమితులైన చైర్‌పర్సన్లు, సభ్యులు రైతులకు ఎల్లవేళలా అండగా ఉండా లని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సూచిం చారు. రామకుప్పం పీఏసీఎస్ చైర్‌పర్స న్‌గా నియమితులైన మహ్మద్‌రఫీ, సభ్యుడిగా నియమితులైన సురేష్ మండల నాయకులతో కలిసి బుధ వారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కలిశారు. ఆయన వారిని శాలువతో సన్మానించారు. ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారా యణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనం దరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, చిన్ని కృష్ణ, గుర్రప్ప, నాగభూషణం, వెంకటాచలం, జయశంకర్, రామలింగారెడ్డి, నవీన్, లక్ష్మీనా రాయణలు పాల్గొన్నారు.

వినియోగదారులకు సక్రమంగా సరుకుల పంపిణీ



డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ అమరనాథ్

రొంపిచెర్ల, జూలై 16 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చౌకదు కాణలకు వచ్చే వినియోగదారు లకు ఆటంకం లేకుండా సక్ర మంగా సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ అమర నాథ్ అన్నారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో మండ లంలోని డీలర్ల సమావేశం జరి గింది. 26 నుంచి 30వ తేదీ వరకు వృద్ధులకు, వికలాంగులకు నిత్యావసర సరుకులను వారి ఇళ్లకు తీసుకెళ్లి ఇవ్వాల న్నారు. సమావేశంలో మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు రఘనాథ్, కార్యదర్శి నవాబ్, రుద్రాచారి, రవినాయుడు తదితర డీలర్లు పాల్గొన్నారు.

వైసీపీ మండల యూత్ అధ్యక్షుడిగా పవన్‌కుమార్

వి.కోట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండల వైసీపీ యూత్ అధ్యక్షులుగా గాండ్ల పల్లెకు చెందిన పవన్‌కుమార్‌ను ఎంపిక చేసి నట్లు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పి.ఎస్.నాగరాజ్, మండల పార్టీ కన్వీనర్, ఎంపీపీ యువరాజ్ తెలిపారు. పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంక టేగౌడ ఆదేశానుసారం వి.కోట మండల పరి ధిలోని అన్ని విభాగాలకు నూతన సారథు లను నియమిస్తూ రాష్ట్ర పార్టీ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. మండల మహిళా విభాగం అధ్యక్షురాలుగా వి.కోటకు చెందిన శశికళ, మండల రైతు విభాగం అధ్యక్షులుగా ముదరందొడ్డికి చెందిన రాధాకృష్ణారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులుగా బెల్ల కుంటకు చెందిన మంజునాథ్, ఎస్సీసెల్ అధ్య క్షులుగా ఎస్.బండపల్లెకు చెందిన మాజీ ఎంపీటీసీ శివరాం, ఎస్టీసెల్ కొంగాటానికి చెందిన శరబాద్, మైనారిటీ ఎస్ అధ్యక్షులుగా కొంగాటానికి చెందిన ఎంపీసీటీ సమ్మద్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షులుగా సాయిశ్యాం లను నియమిస్తూ ఉత్తర్వులు అందాయ న్నారు. పదవిని బాధ్యతతో నిర్వర్తించి పార్టీ వైభవానికి పనిచేస్తామని యూత్ వింగ్ అధ్య క్షులు పవన్ తెలిపారు. తమ ఎంపికకు కృషి చేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

కుటుంబ కలహాలతో ఎక్స్‌కవేటర్ డ్రైవర్ ఆత్మహత్య



అనిల్‌కుమార్ (ఫైల్ ఫొటో)

పుంగనూరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహా లతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మ హత్య చేసుకున్న సంఘటన పుంగనూరు మండలంలో బుధ వారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండ లంలోని బోడేవారిపల్లె పంచా యతీ ఈడిగపల్లెకు చెందిన రాధా కృష్ణ కుమారుడు అనిల్‌కుమార్ (25) ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అన్నమయ్య జిల్లా మదనపల్లెకి చెందిన అశ్వనితో మూడేళ్ల క్రితం వివాహం కాగా.. వీరికి 18 నెలల కుమార్తె ఉంది. ఇటీవల భార్యా భర్తల మధ్య చిన్నచిన్న గొడ వలు రావడంతో భార్య అశ్విని పుట్టింటికి వెళ్లగా పలుమార్లు పిలిచినా భార్య రాకపోవడంతో మనస్తాపానికి గురైన అనిల్‌కు మార్ మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం గుర్తించారు. పోలీసులకు సంఘ టనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిం చారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్ప త్రికి తరలించి భార్య అశ్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రప్రభ వాహనంపై కోదండరాముడి రాజసం



చంద్రప్రభ వాహనంపై విహరిస్తున్న కోదండరాముడు

తవణంపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.పుత్తూరు కోదండ రామాల యంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు చంద్రప్రభ వాహనంపై వైభ వంగా ఊరేగారు. ఆలయ అర్చకులు ఉదయం స్వామివా రికి తిరుమంజనం, పాలాభిషే కంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ఉంజల్‌సేవ నిర్వహించి, చంద్రప్రభ వాహనంపై మేళతాళాల నడుమ టి.పుత్తూరు పురవీధుల్లో వైభవంగా ఊరేగిం చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వ రరెడ్డి, ఉభయదారులతో పాటు టి.పుత్తూరు, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పుష్పపల్లకి సేవ

రామకుప్పం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రామ కుప్పం పట్టణంలోని గ్రామదేవత గంగమ్మ జాత రలో భాగంగా బుధవారం రాత్రి పుష్పపల్లకీ సేవ నేత్రపర్వంగా జరిగింది. రాత్రి 9 గంటలకు గంగమ్మ, పోతులరాజు, నల్లాపురెమ్మ ఉత్సవర్లను అలంకరించి పల్లకిలో అధిష్ఠింపజేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, డప్పుల హోరు, బాణవేడుకల మధ్య పల్లకిలను పురవీధుల్లో ఊరేగించారు.

ఎల్లమ్మ కొలుపు దేవర్లకు ఏర్పాట్లు

సోమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నడింపల్లె పంచాయతీ కరకమందలో కొలువు దీరిన చెన్నమల్లయ్య, ఎల్లమ్మదేవత ఆల యాల్లో కొలుపు దేవర్లకు ఏర్పాట్లు చురుగ్గా చేప ట్టారు. ఈ నేపథ్యంలోనే ఆలయాల్లో 18వ తేదీన కుంభాభిషేకం, 19న ఎల్లమ్మ దేవతకు గంగస్నాన కార్యక్రమాలు, అభిషేక పూజలు, పుష్ప పల్లకీ సేవలు, ఉత్సవాలు, 20వ తేదీన సిద్ధపూజల నిర్వ హణకు ఏర్పాట్లుకు శ్రీకారం చుట్టారు. ఆలయాన్ని సుందరంగా పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలంక రణలు ఏర్పాట్లు చేశారు. తిరుపతి ప్రధాన రోడ్డు నుంచి కరకమంద ఎల్లమ్మ దేవత ఆలయం వరకు విద్యుత్ దీపాలంకరణలు చేశారు.

బురుజుపల్లెలో ఆకట్టుకున్న పోతురాజు విన్యాసాలు

సోమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నెల్లిమంద పాలేటమ్మవారి ఆలయంలో జాతర నేపథ్యంలో బుధవారం అమ్మవారి ఉత్సవమూర్తిని బురుజుప ల్లెలో ఊరేగించారు. ఈక్రమంలోనే పోతురాజు విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారికి భక్తులు ఇంటింటా పూజలు చేసి మొక్కులు తీర్చు కున్నారు. ఆలయ అర్చకులు పాలేటి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



డీడీని విరాళంగా అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి విశాఖపట్టణానికి చెందిన శ్రీకాంత్ బుధవారం రూ. 1,00,000 విరాళంగా డీడీ రూపంలో అందించారు. విరాళదాతకు సూపరింటెం డెంట్ వాసు స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షిం చారు. దర్శనానంతరం దాతకు స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు.

వరసిద్ధుడి ఆలయానికి ఇన్వర్టర్ కానుక

ఐరాల(కాణిపాకం), జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి అమరరాజ కంపెనీ వారు రూ.20,000 విలువ గల బ్యాటరీ ఇన్ వర్టర్‌ను బుధవారం అందచేశారు. అమరరాజ సిబ్బంది వీటిని తీసుకొచ్చి ఆలయ సూపరింటెం డెంట్ వాసుకు అందించారు. అమరరాజ సిబ్బందికి సూపరింటెండెంట్ ఆలయ మర్యాదలతో స్వామి దర్శన భాగ్యం కల్పించి, అనంతరం స్వామి శేషవ స్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు.

స్వయం ఉపాధి కోసమే మహిళలకు కుట్టు శిక్షణ

బంగారుపాళ్యం, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కోసమే మహిళలకు ప్రభుత్వం ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చిందని, మహిళలు ఇందులో నైపుణ్యం సాధించి ఆ రంగంలో నిలదొక్కు కోవాలని బీసీ కార్పొరేషన్ అధికారులు శ్రీదేవి, మోహన్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచిత కుట్టు శిక్షణను పూర్తి చేసుకున్న మహిళలతో సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా మొదటి విడతలో 90 రోజులు పూర్తి చేసుకున్న మహిళలు కుట్టిన బట్టలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేష్, కుట్టు శిక్షణ పొందిన మహి ళలు పాల్గొన్నారు.

'చెప్పింది చేస్తాం... చెప్పనివీ చేసి చూపుతాం'


గొల్లమడుగు దళితవాడలో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చెప్పిన హామీలే కాకుండా చెప్పనవి సైతం చేసి చూపిస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మండలంలోని పానాటూరు, గొల్లమడుగు, బొమ్మసముద్రం, మరకాలకుప్పం పంచాయతీల్లో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే నాలుగేళ్లలో గుడిపాల మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శిరీష, తహసీల్దార్ శ్రీనివాసులు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు బాలాజీ నాయుడు, చంద్రమోహన్, దొరబాబు, నాగరాజ్ యాదవ్, ధనసింగ్, వాసుదేవరెడ్డి, జయచంద్ర, రంగారెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'


పత్రపల్లిలో కరపత్రాలు పంచిపెడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

యాదమరి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. బుధవారం మండల టీడీపీ శ్రేణులతో కలిసి 155 కమ్మపల్లి, పత్రపల్లి, సిద్దారెడ్డిపల్లి, భూమిరెడ్డిపల్లి, కాశిరాల గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించి ఏడాదిలో చేసిన సంక్షేమ పథకాల అమలును వివరించి కరపత్రాలు పంచిపెట్టారు. పూతలపట్టు నియోజకవర్గ పరిశీలకులు బొమ్మన శ్రీధర్, టీడీపీ మండల అధ్యక్షుడు మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, సింగిల్ విండో ఛైర్మన్ చిత్రా నాయుడు, సర్పంచ్ హేమయ్య నాయుడు, నాయకులు హేమగిరి, వల్లేరు అమర్‌నాథ నాయుడు, సుభాష్ నాయుడు, అవినేని మాధవ నాయుడు, గుణశేఖర్, గోపి గౌడ్, మహబూబ్ బాషా, వేణు నాయుడు, ధరణిప్రకాష్, పట్టాభి పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయానికి అమరరాజ ఇన్వర్టర్ కానుక


బ్యాటరీని అందిస్తున్న అమరరాజ సిబ్బంది

ఐరాల(కాణిపాకం), జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి అమరరాజ కంపెనీ వారు రూ. 20,000 విలువ గల బ్యాటరీ ఇన్వర్టర్‌ను బుధవారం అందచేశారు. అమరరాజ సిబ్బంది వీటిని తీసుకొచ్చి ఆలయ సూపరింటెండెంట్ వాసుకు అందించారు. అమరరాజ సిబ్బందికి సూపరింటెండెంట్ ఆలయ మర్యాదలతో స్వామి దర్శన భాగ్యం కల్పించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు.

భాస్కరనాయుడి మృతి టీడీపీకి తీరనిలోటు

వెదురుకుప్పం, జూలై 16(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం గొడుగు చింత మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత పైడి భాస్కర నాయుడి మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే థామస్ అన్నారు. ఎమ్మెల్యే బుధవారం గొడుగు చింత గ్రామానికి వెళ్లి భాస్కరనాయుడి పార్థివదేహానికి టీడీపీ జెండా కప్పి, పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, గురుసాల కిషన్‌చంద్, బోడిరెడ్డి సుధాకరరెడ్డి, సాతాల గుణశేఖర్ యాదవ్, గాలి బాబు నాయుడు, రజనీకాంత్ పాల్గొన్నారు.

● భాస్కరనాయుడి మృతదేహాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు, జిల్లా అధికార ప్రతినిధి చిన్నబాబు పార్టీ నాయకులతో కలసి సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం


టీటీకండ్రిగలో కరపత్రాలిస్తున్న ప్రభుత్వ విప్ థామస్

వెదురుకుప్పం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ప్రభుత్వ విప్, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ అన్నారు. బుధవారం కార్వేటినగరం మండలం టీటీకండ్రిగ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ థామస్ నాయకులతో కలిసి వెళ్లి కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల ఫలాలు మాకు సవ్యంగా అందుతున్నాయని ప్రజలు థామస్ దృష్టికి తీసుకొచ్చారు. వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రాజేంద్ర రెడ్డి, ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ యుగంధర్ పొన్న, మాజీ ఎంపీపీ ఇందిర, మాజీ ఎంపీటీసీ ఎం.మోహన్, నాయకులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి విశాఖపట్టణానికి చెందిన శ్రీకాంత్ బుధవారం రూ. 1,00,000 విరాళంగా డీడీ రూపంలో అందించారు. విరాళదాతకు సూపరింటెండెంట్ వాసు స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు.

విజయంలో ఇన్వెస్టిట్యూర్ వేడుకలు


ఇన్వెస్టిట్యూర్‌లో ఎంపికైన విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సుందరరాజపురంలోని విజయం సీబీఎస్ఈ పాఠశాలలో విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి ఆధ్వర్యంలో బుధవారం ఇన్వెస్టిట్యూర్ వేడుకలు నిర్వహించారు. ఓటింగ్ ద్వారా ఎంపికైన పాఠశాల క్యాబినెట్‌లోని సభ్యులు హెడ్ బాయ్, హెడ్ గర్ల్, స్పోర్ట్స్ కెప్టెన్ తదితర స్లాష్‌లు, బ్యాడ్జీలు ప్రదానం చేశారు. వీరితో ప్రమాణస్వీకారం చేయించారు. అకడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు ఉండాలని, ఎంపికైన వారు విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం అఖిల రమేష్, శ్రీదేవి, పీడీలు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితో యువకుడి ఆత్మహత్య

యాదమరి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కీనాటంపల్లెలో మానసిక ఒత్తిడి తట్టుకోలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కీనాటంపల్లి దళితవాడకు చెందిన అశోకన్ కుమారుడు ఎం. దేవా (18) ఐటీఐ చదువుతున్నాడు. గత కొంతకాలంగా చదువులో వెనుకబడిన కారణంగా లోలోపల మథనపడేవాడు. తీవ్ర మానసిక ఒత్తిడికి గురై మంగళవారం రాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే దేవా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్


నింద్ర పీఏసీఎస్ నూతన ఛైర్మన్, డైరెక్టర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్


విజయపురంలో ఎమ్మెల్యే సమక్షంలో పదవీ ప్రమాణం చేస్తున్న ఛైర్మన్, డైరెక్టర్లు

నింద్ర, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన నింద్రలో పీఏసీఎస్ ఆవరణలో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ పాలకవర్గం రైతు సంక్షేమానికి కృషి చేస్తూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. సీఎం చంద్రబాబు పాలనలో రైతులకు సబ్సిడీ విత్తనాలు, మందులు, గిట్టుబాటు ధర కల్పించినట్లు చెప్పారు. పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు పార్టీ కోసం ప్రజలకోసం పనిచేస్తారని కొనియాడారు. గ్రామాల్లో ఇంటిస్థలాలు ఉండి పట్టాలు లేనివారు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకుంటే ప్రభుత్వం ఇంటి పట్టాలు అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పీఏసీఎస్ ఛైర్మన్ పేరం వెంకటేశ్వరరావును, డైరెక్టర్లు పెరుమాల్‌రెడ్డి, శివలింగంలను ఎమ్మెల్యే పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ చక్రపాణి రెడ్డి, జనసేన నాయకులు మెరుపుల మహేష్, నాయకులు దశరథవాసు, రవి నాయుడు, వెంకటేశులు నాయుడు, విజయ్‌కుమార్, సుబ్బారావు, జగన్, భాస్కర్, బాబు యాదవ్, రమేష్, వెంకటేశులు రెడ్డి, రమేష్, మనోహర్ నాయుడు, పరదేశి, శరవణ, రఘురాం, మురళీ నాయుడు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● విజయపురం: మండలంలోని అగరం రామకృష్ణా సింగిల్ విండో ఛైర్మన్ బాబునాయుడు పోతురాజు కండ్రిగలో, కోసలనగరం సింగిల్ విండో ఛైర్మన్ బాబుయాదవ్ విజయపురం పీఏసీఎస్‌లో జరిగిన పదవీ స్వీకార మహోత్సవంలో ఎమ్మెల్యే భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్లు, డైరెక్టర్లు మురళీ, వరదరాజులు, వీరరాఘవులు, రవినాయుడు తదితరులు పదవీ ప్రమాణం చేశారు. ఎమ్మెల్యేని కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, నేతలు చుక్కా ధనుంజయ యాదవ్, బాలసుబ్రహ్మణ్యంరాజు, రమేష్‌రాజు, గుణభూషణమ్మ, గజేంద్ర నాయుడు, దశరథరాజు, శివలింగం, వేణుగోపాల్ నాయుడు, సుధాకర్‌రాజు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా మీడియా కన్వీనర్‌కు సన్మానం


పీతాంబరరెడ్డిని సన్మానిస్తున్న జాకబ్

వెదురుకుప్పం, జూలై 16(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా మీడియా కన్వీనర్ డి.పీతాంబరరెడ్డిని బుధవారం ఘనంగా సన్మానించి, సత్కరించారు. వెదురుకుప్పం మండలం బలిజమొండివెంగనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 8 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పని చేసి, బదిలీపై కార్వేటినగరానికి వెళ్లారు. ఈ క్రమంలో బుధవారం బలిజమొండివెంగనపల్లి పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, యాజమాన్య కమిటీ ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ పి.జాకబ్, వైస్ ఛైర్మన్ వి.సంగీత, ప్రధానోపాధ్యాయులు ఎం.సరస్వతి, తల్లిదండ్రులు ఘనంగా సన్మానించి, సత్కరించారు.

అధికారులు బాధ్యతతో పని చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్

ఐరాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతి అధికారి బాధ్యతతో పని చేయాలని ఎంపీపీ మోహన్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నందకుమార్ మాట్లాడుతూ వేసవి ముగిసినందున మండల కేంద్రంలోని వీఎస్.అగ్రహారంలోని న్యాకాలనీకి డ్రైనేజీని మంజూరు చేస్తామన్నారు. ఎంఈవో రుష్యేంద్రనాథ్ మాట్లాడుతూ మండలంలో డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పీఆర్ ఏఈ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో రూ.98.36 లక్షలతో 62 సీసీ రోడ్లు పూర్తి చేశామన్నారు. ఏవో వరలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని రైతులకు 1300 క్వింటాళ్ల వేరుశనగ కె.6 విత్తనాలు అందించామన్నారు. ట్రాన్స్‌కో ఏఈ నీరజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇళ్లపై సోలార్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లోకేశ్వరి, ఎంపీడీవో ధనలక్ష్మి, హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ వాసు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ సేవలు అభినందనీయం


సన్మానిస్తున్న నగరి డీఎస్పీ, వెదురుకుప్పం ఎస్ఐ

వెదురుకుప్పం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం నాయుడు, హెడ్ కానిస్టేబుల్ రఫీ సేవలు అభినందనీయమని డీఎస్పీ సయ్యద్ మోహమ్మద్ అజీజ్ తెలిపారు. బుధవారం రాత్రి వెదురుకుప్పం పోలీసుస్టేషన్‌లో పదవీ విరమణ పొందిన వారికి ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహనమురళి, నాయకులు మోహన్‌రెడ్డి, చిరంజీవి నాయుడు, జయచంద్ర తదితరులు ఉన్నారు.

స్వయం ఉపాధి కోసమే మహిళలకు కుట్టు శిక్షణ


సమావేశంలో ప్రసంగిస్తున్న మోహన్

బంగారుపాళ్యం, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కోసమే మహిళలకు ప్రభుత్వం ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చిందని, మహిళలు ఇందులో నైపుణ్యం సాధించి ఆ రంగంలో నిలదొక్కుకోవాలని బీసీ కార్పొరేషన్ అధికారులు శ్రీదేవి, మోహన్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచిత కుట్టు శిక్షణను పూర్తి చేసుకున్న మహిళలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మొదటి విడతలో 90 రోజులు పూర్తి చేసుకున్న మహిళలు కుట్టిన బట్టలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేష్, కుట్టు శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఆణివార ఆస్థానం

వెదురుకుప్పం, జూలై 16(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా ఆణివార ఆస్థానం కార్యక్రమాన్ని వేదపండితులు నిర్వహించారు. ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు.

చంద్రప్రభ వాహనంపై కోదండరాముడి రాజసం

తవణంపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.పుత్తూరు కోదండ రామాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు చంద్రప్రభ వాహనంపై మేళతాళాల నడుమ టి.పుత్తూరు పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఆలయ అర్చకులు ఉదయం స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి, ఉభయదారులతో పాటు టి.పుత్తూరు, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్ష పదవి ఇవ్వండి

వెదురుకుప్పం, జూలై 16(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం బంగారమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ కొప్పేటి ప్రసాద్ బుధవారం ఎమ్మెల్యే థామస్‌ను కలిశారు. తాను టీడీపీ మండల అధ్యక్ష పదవిని ఆశిస్తున్నానని తెలిపారు.

కొనసాగుతున్న హైరోడ్డు విస్తరణ పనులు

చిత్తూరు అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న రోడ్ల విస్తరణలో భాగంగా బుధవారం హైరోడ్డులో పనులు కొనసాగాయి. కట్టమంచి నుంచి వంద అడుగుల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో హైరోడ్డులోని కట్టమంచి వద్ద ఉన్న ఓ ప్రైవేటు స్థల యజమానిని ఒప్పించడంతో పాటు అతని వద్ద అంగీకార పత్రాన్ని తీసుకుని వంద అడుగుల వరకు రోడ్డుకు కావాల్సిన స్థలాన్ని ఎక్స్‌కవేటర్ల సహాయంతో ఏసీపీ నాగేంద్ర తొలగించారు.

కాణిపాక క్షేత్రాన్ని మరింత అభివృద్ధి పరచండి


స్వామిసేవలో పాల్గొన్న వైద్యప్రవీణ్‌కుమార్

ఐరాల(కాణిపాకం), జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రాన్ని మరింత అభివృద్ధిపరచాలని జాతీయ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, యువభారత్ ఛైర్మన్ వైద్యప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన కాణిపాక వరసిద్ధుడి దర్శనార్థం విచ్చేసి ఈవో పెంచలకిషోర్‌ను కలిశారు. వెంకటేష్‌యాదవ్, రమేష్, కుప్పం భాస్కర్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

విజయపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగమాంబాపురం ఉన్నత పాఠశాలలో 3, 4, 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రయ్య ప్రధానోపాధ్యాయులు సురేష్‌కుమార్ చేతుల మీదుగా బుధవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులకు అవసరమైన నోటుపుస్తకాలు, క్రయాన్స్, పెన్నులు, పెన్సిల్ వంటి సామగ్రి అందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువ రైతు మృతికి నివాళి

పాలసముద్రం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిశ్శాంకాపురంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన యువ రైతు రాజశేఖర్(33) మృతదేహానికి బుధవారం ప్రభుత్వ విప్ థామస్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీనియర్ టీడీపీ నేత రవి నాయుడి కుమారుడు రాజశేఖర్ మృతి చెందిన విషయం తెలుసుకుని ఎమ్మెల్యే ఆయన్ను పరామర్శించారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు, నాయకులు శేఖర్ రాజు, అరుణ్‌నాథన్, నీరజాక్షుల నాయుడు, కె.విజయ్‌కుమార్, వెంకటేశుల నాయుడు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నగరి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీ చర్చి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జయరాజ్ (75) బుధవారం మృతి చెందారు. సీఐ విక్రమ్ కథనం మేరకు.. విజయపురం మండలం కేవీశ్రీరామాపురానికి చెందిన ఈయన జయరాజ్ రెండు రోజులక్రితం జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. బంధువులు ఆయన్ను చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా, పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

త్వరితగతిన అర్జీల పరిష్కారం

చిత్తూరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డేలో సమర్పించిన అర్జీలను త్వరగతిన పరిష్కరించనున్నట్లు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర అన్నారు. బుధవారం స్థానిక గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో విద్యుతు శాఖ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రీవెన్స్‌లో 4 అర్జీలు రాగా అన్నింటిని పరిష్కరించినట్లు ఆయన తెలిపారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా రూపొందించాలి

పాలసముద్రం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటర్ల జాబితాను రూపొందించేందుకు ప్రతి బీఎల్వో కృషి చేయాలని తహసీల్దార్ అరుణకుమారి తెలియజేశారు. జాతీయ ఓటర్ల శిక్షణా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల డీటీ మోహన్‌రాజ ఆధ్వర్యంలో బీఎల్వోలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సంవత్సరంలో జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబరు నెలల్లో నాలుగు సార్లు చేసే ఓటర్ల జాబితాలో బీఎల్వోలు ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలన్నారు. ట్రైనర్లు శ్యామ్‌కుమార్, కవిత, భువనేశ్వరి, శివకుమార్, బీఎల్వోలు పాల్గొన్నారు.

విశ్రాంత ఎంఈవో మృతి

పూతలపట్టు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఎంఈవో కృష్ణారెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. తవణంపల్లె మండలం జొన్నగురుకుల గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి పూతలపట్టు మండలం ముత్తిరేవులలో స్థిరపడ్డారు. ఈయన పూతలపట్టు ఎంఈవోగా పనిచేసి గత సంవత్సరంలో పదవీ విరమణ పొందారు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం మృతిచెందారు.